క్లుప్తంగా

అర్జీలు సత్వరం విచారించండి

చీరాల టౌన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలోగా విచారించి పరిష్కరించాలని తహసీల్దార్ కుర్రా గోపికృష్ణ సూచించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ, పట్టణ వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాలు, సచివాలయాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అర్జీలు, పాస్ పుస్తకాలు, స్పందన అర్జీలపై సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల్లో, సచివాలయాల్లో పనిచేసే వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు స్పందన అర్జీలను త్వరగా విచారించాలన్నారు. ప్రజలకు జవాబుదారీతనంగా రెవెన్యూ ఉద్యోగులు పనిచేయాలని, విధుల్లో అలసత్వం వహించిన వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న పట్టాదారు పాస్ పుస్తకాలను త్వరగా అందించడంతో పాటు గ్రామాల్లో ఎక్కడా కూడా అనధికార లే అవుట్లు వేయకుండా కట్టడి చేయడంతో పాటుగా నీటి తీరువా వసూళ్లు చేయాలన్నారు. ఇన్‌చార్జి డీటీ సుశీల, ఆర్ఐలు శేఖర్, సత్యం, వీఆర్వోలు ఉన్నారు.

వేటపాలెం తహసీల్దార్‌గా గోపీకృష్ణ

వేటపాలెం: మండల కేంద్రం వేటపాలెం తహసీల్దార్‌గా కె. గోపీకృష్ణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ బదిలీపై మంగళగిరి వెళ్లారు. కార్యాలయానికి వచ్చే ప్రజలు నేరుగా తమను కలిసి వారి పనులు పరిష్కరించు కోవాలని కోరారు.

ముగ్గురు జూదరుల అరెస్ట్

బల్లికురవ: మండలంలోని కొమ్మినేనివారిపాలెం, గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారంతో సోమవారం ఎస్సై వై. నాగరాజు సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకుని రూ. 2800 నగదు స్వాధీన పరుచుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

చీరాల టౌన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం సామాజిక బాధ్యతని, వ్యక్తిగత శుభ్రత ఉండాలని ఈపురుపాలెం పంచాయతీ సెక్రటరీ మురళీ బాపూజీ సూచించారు. సోమవారం ఈపురుపాలెం గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని గాంధీపార్కు కూడలి, సావరపాలెం, 40 ఇండ్లకాలనీ, పద్మనాభునిపేట, సీతారాంపేట, ఇందిరానగర్‌కాలనీ ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. వార్డుల్లో పేరుకుని ఉన్న చెత్తకుప్పలను, చిల్లచెట్లను తొలగించి బ్లీచింగ్ చల్లించారు.

భక్తిశ్రద్ధలతో పుష్పాలంకరణ సేవ




వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో పుష్పాలతో అలంకరించిన దృశ్యం

మేదరమెట్ల: స్థానిక అద్దంకి రోడ్డులో గల భూనీలాసమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి 41వ బ్రహోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారిని పలు రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయదాతలుగా అర్వపల్లి ప్రసాద్ అండ్ సన్స్.. నిడమానూరి వెంకటేశ్వర్లు వ్యవహరించారు. సాయంత్రం స్వామివార్లను గరుడవాహనంపై ఉంచి కమిటీ సభ్యులు గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం జ్యేష్ఠ మాసం శతభిషం నక్షత్రం షష్ఠి తిథి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు సోమవారం తెలిపారు. క్షేత్రప్రధాన్యం ఉన్న మంగళవారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకుపూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు.

గుణదలలో సజ్జల జన్మదిన వేడుకలు



వేడుకల్లో చిన్నారులు

పర్చూరు (చినగంజాం): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం రాత్రి విజయవాడ గుణదల మేరీ మాత ఆశ్రమంలో నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాలిపోగు రాంబాబు ఆధ్వర్యంలో జరిగాయి. గుణదలలోని నవజీవన్ బాల భవన్, దీప నివాస్ అనాథాశ్రమంలో కేక్ కట్ చేశారు. అనంతరం అన్న దానం కార్యక్రమం నిర్వహించారు. సజ్జల రామకృష్ణారెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని కోరుతూ మేరీ మాత మందిరంలో ప్రార్థనలు నిర్వహించారు. ఆశ్రమంలోని అనాథ బాలలు పాల్గొన్నారు.

అధనపు భారం!



- సామాన్యులకు భారమవుతున్న విద్యుత్ చార్జీలు
- ఓవర్ లోడ్ పేరుతో ప్రజల నెత్తిన భారం
- అప్పుల పాలవుతున్న పేద, మధ్యతరగతి వారు



విద్యుత్ శాఖాధికారులను కలిసి మాట్లాడుతున్న వినియోగదారులు

పర్చూరు(చినగంజాం): కూటమి ప్రభుత్వ పాలన ప్రజాకంటకంగా మారింది. ఇచ్చిన హామీలకు, చేసే పనులకు పొంతన లేకుండా పోతోంది. విద్యుత్ చార్జీలు పెంచమని.. వాటిని నియంత్రిస్తామంటూ నేటి సీఎం చంద్రబాబు నాడు చేసిన హామీ నీటిమీద రాతలా మారింది. ప్రస్తుతం విద్యుత్ చార్జీలు అందరికీ షాక్ కొట్టేలా చేస్తున్నాయి. బిల్లులు చెల్లించలేక సతమతమవుతున్నారు. దీనికి తోడు ఓవర్ లోడు పేరుతో విద్యుత్ బిల్లులపై అదనంగా చార్జీలను విధించడంతో ప్రజలకు భారంగా మారింది. ఈ రెండూ ఒకేసారి చెల్లించాల్సి రావడంతో పేద, మధ్యతరగతి వారు అప్పులు చేయాల్సి వస్తోంది.

విద్యుత్ శాఖాధికారులకు విన్నపాలు

పెరిగిన విద్యుత్ చార్జీలు, అదనపు లోడు చార్జీలు ఒక్కసారిగా బిల్లు రూపంలో రావడంతో అంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. తాము పెద్ద మొత్తంలో బిల్లులు కట్టలేమంటూ ఆవేదన చెందుతున్నారు. ఈ క్రమంలో పర్చూరు విద్యుత్ శాఖా కార్యాలయానికి స్థానిక ప్రజలు వెళ్ళి వివరం అడిగి తెలుసుకున్నారు. అదనపు లోడు చార్జీలు, రెగ్యులర్ బిల్లులతో ఒక్కసారిగా కలిపి కట్టలేమంటూ ఏఈ రమేష్ నాయక్‌కు వివరించారు. ఈ విషయమై ఏఈ మాట్లాడుతూ అదనపు లోడు వసూలు చేయక తప్పదని, గత పది సంవత్సరాల నుంచి సమస్య ఉందని అయితే గత ప్రభుత్వాలు అదనపు లోడ్ చార్జీలు వసూలు చేయలేదని తెలిపారు. ఇప్పుడు వసూలు చేయక తప్పడం లేదన్నారు. విద్యుత్ కనెక్షన్ ఇచ్చినప్పుడే అదనపు లోడు చార్జీలు చెల్లించాలని అప్పుడు చెల్లించలేదు కనుక ఇప్పుడు వసూలు చేయక తప్పడం లేదని తెలిపారు. ఈ నెలాఖరులోగా అదనపు విద్యుత్ వాడుకుంటున్న వారంతా ఒక కిలో వాట్‌కు రూ. 1200 చొప్పున చెల్లించాల్సి ఉంటుందన్నారు.

అదనపు లోడు చార్జీలు చెల్లించాలంటే కష్టమవుతోంది



అదనపు లోడు కింద రూ. 4 వేలు చెల్లించాలని విద్యుత్ శాఖ వారు నోటీసులు ఇచ్చారు. పెరిగిన కరంటు బిల్లులు చెల్లించలేని స్థితిలో ఉన్న మాకు అదనపు లోడు రూ. 4 వేలు చెల్లించాలంటే ఎలా? కూటమి ప్రభుత్వం సంపద సృష్టి పేరుతో పేదలను ఇబ్బందులకు గురి చేయడం తగదు.

– కఠారి అప్పారావు, పర్చూరు

విద్యుత్ చార్జీలు, అదనపు లోడు చార్జీలు సామాన్యులకు భారం



అదనపు లోడ్ కింద రూ. 4 వేలు చెల్లించాలని విద్యుత్ శాఖాధికారులు తెలిపారు. ఈ చార్జీలు చెల్లించడం సామాన్యులకు భారంగా ఉంది. ప్రభుత్వం అదనపు లోడు చార్జీలను వాయిదాల పద్ధతిలో బిల్లులలో వేసి వసూలు చేస్తే బాగుంటుంది. ఒకే సారి చెల్లించాలంటే కష్టం.

– యద్దనపూడి హరిప్రసాద్, పర్చూరు

గృహాల్లోకి మురుగు నీరు



తిమ్మనపాలెం ఎస్సీ కాలనీలోని ఇళ్లలోకి వచ్చి చేరిన వర్షపు నీరు





నివాసాల్లోకి వచ్చిన నీటిని బయటకు పోస్తున్న మహిళలు

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని తిమ్మనపాలెంలో మురుగు సమస్య వేధిస్తోంది. గ్రామ పంచాయతీ పరిధిలో గల నాగులుప్పలపాడు రోడ్డు కు ఇరువైపులా ఉన్న సైడు కాలువపై అక్రమ కట్టడాలు కట్టడం వలన మురుగు కాలువలు పూడిపోయి మురుగునీరు నివాసాల్లోకి వస్తోంది. పంచాయతీ అధికారులకు, గ్రామ సర్పంచ్‌కు ఈ సమస్య గురించి గత రెండు మాసాలుగా చెపుతున్నా వారు పట్టించుకోవడంలేదని కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు. ఇటీవల చెదురుమొదురుగా కురుస్తున్న వర్షాలకు సైడు కాలువల్లోకి వెళ్లాల్సిన వర్షపు నీరు కాలువలు సరిగా లేకపోడం వలన సమీపంలోని నివాసాల్లోకి వచ్చి చేరుతున్నాయని దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు కాలనీవాసులు చెపుతున్నారు. వర్షపు నీరు సరిగ్గా పారకపోడంవల్ల ఇళ్ల మధ్య నిలిచి ఉండటంతో మురుగు ఏర్పడి తద్వారా దోమలు రావడం దుర్గంధం వెదజల్లుతోందని దీంతో జ్వరాలు వస్తున్నాయని చిన్న పిల్లలు, వృద్ధులు తీవ్ర అనారోగ్యాలకు గురికావడం జరుగుతుందని వాపోతున్నారు. అధికారులు కానీ.. పంచాయతీ సర్పంచ్‌గానీ స్పందించి సైడు కాలువలను సరిచేయించాలని.. కాలువలపై ఉన్న అక్రమ కట్టడాలను తొలగించి కాలువల్లోని పూడికను తొలగించాలని కాలనీ వాసులు వేడుకొంటున్నారు. నివాసాల మధ్య నివశించాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మురుగునీరు, వర్షపు నీరు సక్రమంగా సైడు కాలువల్లో పారేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

విద్య ప్రాముఖ్యత గుర్తించాలి



కడవకుదురులో సన్మానం చేస్తున్న పాఠశాల సిబ్బంది



కొత్తపాలెంలో ఉదయకృష్ణారెడ్డిని సన్మానించి జ్ఞాపికను అందజేస్తున్న సభ్యులు

చినగంజాం: విద్య ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాల్సిన అవసరం ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతైనా ఉందని ఆల్ ఇండియా యూపీఎస్సీ 350వ ర్యాంక్ హోల్డర్ మూలగాని ఉదయ్‌కృష్ణారెడ్డి అన్నారు. ఆల్ ఇండియా యూపీఎస్సీ ర్యాంక్ హోల్డర్ మూలగాని ఉదయకృష్ణారెడ్డి సన్మాన సత్కార సభ మండలంలోని కొత్తపాలెం, కడవకుదురు, కుక్కల వారిపాలెం గ్రామాల్లో సోమవారం నిర్వహించారు. ఆయా సభల్లో ఆయన విద్యార్థులు, క్రీడాకారులు, తల్లిదండ్రులకు ఉత్తేరణ కలిగించే ప్రసంగాలు చేశారు. ఇందులో భాగంగా కొత్తపాలెం రెడ్డీస్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో సీబీఐ సీఐగా విధులు నిర్వహిస్తున్న కుక్కల రామకృష్ణారెడ్డి అధ్యక్షతన స్థానిక బాలకోటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో సభ నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన యువ క్రీడాకారులకు, విద్యార్థులకు ఉదయకృష్ణారెడ్డి విద్య ప్రాముఖ్యతను గురించి తెలియజేశారు. సమాజంలో గుర్తింపు, విలువలతో కూడిన గౌరవం చదువుతోనే సాధ్యమవుతుందని వారికి తెలియజేశారు. అనంతరం ఇటీవల క్రీడల్లో రాణించిన క్రీడాకారులకు ఆయన జ్ఞాపికలను అందజేశారు, అనంతరం ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు అతనిని శాలువా కప్పి, జ్ఞాపికను అందజేసి ఘనంగా సన్మానించారు. అనంతరం కుక్కలవారిపాలెం గ్రామంలో యువకులనుద్దేశించి ఆయన మాట్లాడారు. జీవితంలో ఏదైనా సాధించాలనే పట్టుదల కలిగి ఉండాలని వారికి తెలియజేశారు. కడవకుదురు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కుర్రా రామారావు అధ్యక్షత వహించగా పాఠశాల సిబ్బంది, కడవకుదురు గ్రామ పెద్దలు ఆయనకు శాలువాలు కప్పి జ్ఞాపికను అందజేసి ఘనంగా సన్మానించారు. జెడ్పీ పాఠశాల సిబ్బందితో పాటు రెడ్డీస్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రెసిడెంట్ మారుబోయిన నాగారాజు రెడ్డి, కార్యదర్శి ఆట్ల రాంబాబురెడ్డి, ట్రెజరర్ రామకోటి రెడ్డి, అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మారుబోయిన వెంకటరెడ్డి, మారుబోయిన రవీంద్రారెడ్డి, అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

మోటార్ వర్కర్స్ యూనియన్ ఏకగ్రీవం



ఎంపికైన మోటార్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు

పర్చూరు(చినగంజాం): పర్చూరు మోటార్ వర్కర్స్ యూనియన్ ఎన్నిక సోమవారం పర్చూరులో నిర్వహించారు. యూనియన్ సభ్యులు ఎంపికను ఏకగ్రీవంగా నిర్వహించారు. యూనియన్ అధ్యక్షుడుగా పాటిబండ్ల జయరావు, వైస్ ప్రెసిడెంట్‌గా తులసి బాలకృష్ణ, కార్యదర్శి సాతులూరి జరిమ్మయ, జాయింట్ సెక్రటరీ పఠాన్ బాజీ, కోశాధికారి సయ్యద్ నాగూర్ వలి, సంయుక్త కోశాధికారి కట్టింపూడి రాజు ఎంపికయ్యారు. ఈసందర్భంగా ఎంపికైన యూనియన్ సభ్యులు మాట్లాడుతూ మోటార్ వర్కర్స్ యూనియన్ గత 50 సంవత్సరాలుగా పర్చూరులో కార్మికులకు సేవలందిస్తుందన్నారు. యూనియన్ తరపున ఆగస్టు 15, జనవరి 1, జనవరి 26 రిపబ్లిక్ డే, మే 1న మేడే వంటి పండుగలు, జాతీయ పండుగలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వైభవంగా నాగండ్ల బండ్లమాంబ తిరునాళ్ల

ఇంకొల్లు(చినగంజాం): మండలంలోని నాగండ్ల గ్రామంలో వేంచేసియున్న బండ్లమాంబ అమ్మవారి వార్షిక తిరునాళ్ల మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మేళతాళాలు, డప్పు వాయిద్యాల మధ్య అమ్మవారి తిరునాళ్లను గ్రామంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అత్యంత శోభాయామానంగా అలంకరించారు.



అలంకరణలో బండ్ల మాంబ

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నలుగురికి జరిమానా

అద్దంకి రూరల్: అద్దంకి మండల పరిధిలో మద్యం సేవించి మోటార్ బైక్‌లు నడిపిన 4 గురు వ్యక్తులను సీఐ సుబ్బారాజు సోమవారం అద్దంకి కోర్టులో హాజరు పరిచారు. న్యాయమూర్తి బి. అఖిల ఒక్కోరికి రూ. 2 వేలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

అభ్యర్థన సామగ్రి పంపిణీ



వైదనలో సామగ్రి పంపిణీ చేస్తున్న హెచ్ఎం ఉపాధ్యాయులు

బల్లికురవ: గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులను విద్య పట్ల ఆకర్షితులను చేసేందుకు దాత అభ్యర్థన సామగ్రి పంపిణీతో చేయూతనివ్వడం అభినందనీయమని వైదన ఉన్నత పాఠశాల, మోడల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కుందుర్తి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం పాఠశాలలోని 350 మంది విద్యార్థులకు సుమారు రూ. 30 వేలతో దాత ఆళహరి మహీధర నాయుడు అభ్యర్థన సామగ్రి అందజేయటంతో పంపిణీ చేశారు. విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలకు రావాలని సబ్జెక్టులో అర్థం కాని విషయాలను ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని హెచ్ఎంను కోరారు. కార్యక్రమంలో దాత ప్రతినిధులైన ఉపాధ్యాయులు ఆళహరి లావణ్య, కోరే శేషగిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మలేరియా నివారణకు ప్రత్యేక చర్యలు



స్వర్ణలో ర్యాలీ చేస్తున్న వైద్య, పంచాయతీ సిబ్బంది

స్వర్ణ (కారంచేడు): గ్రామాల్లో మలేరియా వ్యాధుల నివారణకు వైద్య ఆరోగ్య శాఖ గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య శాఖ సహకారంతో ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని స్వర్ణ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం. శాలిని అన్నారు. సోమవారం మండలంలోని స్వర్ణ గ్రామంలో నిర్వహించిన మలేరియా మాసోత్సవ ర్యాలీలో వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బందికి పలు సూచలు చేశారు. ప్రజల సహకారంతో గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాలు కురుస్తున్న కారణంగా ఎక్కడా మురుగునీటి నిలచిపోకుండా కాలువలు తీసుకోవాలని సూచించారు. అలాగే వాడి పడేసిన కొబ్బరి బోండాలు, టీకప్పులు, పూల కుండీలు, నీటి తొట్లలో కూడా లార్వా వ్యాప్తి చెందే అవకాశాలున్నందున వాటని బోర్లించుకోవాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా ప్రజల్లోను అవగాహన కల్పించాలని కోరారు. ఎంపీహెచ్ఈఓ వి. నాగేశ్వరరావు, సూపర్‌వైజర్ రవి, హెచ్ఈ మీనాకుమారి, హెచ్‌వీ మాధురీ సిఫోరా, ఏఎన్ఎంలు, ఆశాలు, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఉపాధ్యాయులు



కారంచేడులో ఎంఈఓకు జాయినింగ్ రిపోర్టును అందిస్తున్న ఉపాధ్యాయులు

కారంచేడు: ప్రభుత్వ ఉపాధ్యాయ బదిలీల కౌన్సెలింగ్ పూర్తయింది. ఈ నెల 11వ తేదీ నుంచి 15వ తేదీ వరకు వివిధ కేడర్ ఉపాధ్యాయులతో పాటు, ఎస్‌జీటీల కౌన్సెలింగ్‌లు పూర్తి చేశారు. ఒంగోలులో నిర్వహించిన బదిలీల్లో వారు కోరుకున్న స్థానాలకు వచ్చిన ఆర్డర్ కాపీలను తీసుకొని ఉపాధ్యాయులు సోమవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో జాయినింగ్ రిపోర్టులు అందించారు. ఉపాధ్యాయులు పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు కోరారు. మండలంలోని 14 గ్రామాల పరిధిలో మొత్తం 10 మంది ఉపాధ్యాయులు వేరే మండలాలకు బదిలీలు కాగా వివిధ మండలాల నుంచి 14 మంది ఉపాధ్యాయులు కారంచేడు మండలానికి బదిలీ అయ్యారు. 11 మంది ఉపాధ్యాయులు మండలంలోనే వివిధ గ్రామాల్లోని పాఠశాలలకు బదిలీలపై స్థాన చలనం పొందినట్లు ఎంఈఓలు తెలిపారు.

వ్యాధుల నుంచి విముక్తి కోసం యోగా



పోలీస్ సిబ్బందితో యోగా చేయిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

పర్చూరు(చినగంజాం): వ్యాధుల నుంచి విముక్తి పొందేందుకు యోగా మంచి మార్గం అని మండల యోగా పర్యవేక్షణాధికారి, మాస్టర్ ట్రైనర్, ఉప్పుటూరు హోమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం స్థానిక అద్దంకి నాంచారమ్మ కల్యాణ మండపం ఆవరణలో మండలంలోని పోలీస్ సిబ్బందికి యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం నిత్యం యోగాతోనే సాధ్యమవుతుందని, ప్రతి రోజూ 40 నిమిషాలు యోగా చేయడం ద్వారా 70 శాతం వ్యాధుల నుంచి విముక్తి పొందవచ్చని తెలిపారు. జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రతి ప్రభుత్వ కార్యాలయం, ప్రతి గ్రామానికి నిర్దేశించిన 10 యోగా వేదికల వద్ద జరుగుతుందని ప్రజలందరూ ఆసక్తిగా పాల్గొని సంపూర్ణ ఆరోగ్య వంతులుగా మారాలను కోరారు. పర్చూరు మండల ఎస్ఐ మాల్యాద్రి మాట్లాడుతూ డాక్టర్ చంద్రశేఖర్ మండలంలో యోగా శిక్షణ ఇచ్చి అంతా ఆరోగ్యం వైపు అడుగులు వేసే విధంగా కృషి చేస్తున్నారని చెప్పారు. పోలీస్ సిబ్బందికి కూడా యోగా శిక్షణ ఇవ్వడం తనకు ఎంతో ఆనందం కలిగించిందన్నారు.

వ్యవసాయ పనులకు సమాయత్తం



వల్లాపల్లిలో దుక్కిదున్నుతున్న రైతు

బల్లికురవ: ఇటీవల కురుస్తున్న వర్షాలకు భూములు పదునెక్కటంతో రైతులు గ్రామాల వారీగా వ్యవసాయ పనులకు సమాయత్తం అవుతున్నారు. మండలంలోని వల్లాపల్లి, అంబడిపూడి, గుంటుపల్లి, కొత్తపాలెం, బల్లికురవ, నక్కబొక్కలపాడు, మల్లాయపాలెం, వేమవరం, కొప్పరపాలెం, ఉప్పుమాగులూరు, కొణిదెన, గంగపాలెం గ్రామాల్లో మెట్ట భూములు ట్రాక్టర్‌తో దుక్కులు దున్నుతున్నారు. భూములు పదునెక్కటంతో మరో పదిరోజుల్లో మొక్కజొన్న పత్తి, కంది, మిర్చి సాగుకు సమాయత్తం కానున్నట్లు రైతులు అవిశెన బుల్లి రెడ్డి, పెద్ది ఏడుకొండలు తెలిపారు. ఈ సందర్భంలో వ్యవసాయాధికారి పి. శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు మేలైన, నాణ్యత కలిగిన విత్తనాలు ఆధీకృత డీలర్ల వద్ద కొనుగోలు చేయాలన్నారు. విత్తనాలతోపాటు బిల్లు తీసుకుని భద్రపరుచుకోవాలని ఏఓ కోరారు.

ఘనంగా వార్షిక శాంతి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అద్దంకి: శింగరకొండపైనున్న క్షేత్రపాలకుడు శ్రీలక్ష్మి నరసింహ స్వామి పునఃప్రతిష్ఠ నిర్వహించిన రోజైన సోమవారం స్వామివారికి ఘనంగా వార్షిక శాంతి కళ్యాణాన్ని అర్చకులు నిర్వహించారు. దానిలో భాగంగా విశేష పూజతోపాటు, పంచామృతాభిషేకం, ఆరాధన నిర్వహించారు. ఈ కళ్యాణ కార్యక్రమంలో గోలి భార్గవ శ్రీనివాసరావు దంపతులు నిర్వహించారు. కార్యక్రమం భాగవతుల అరుణాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు.